# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 116 | పేజీలు : 08 | శనివారం | 02-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# ఆర్టీసీ సమస్యల పరిష్కారమే లక్ష్యం




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు హామీలిచ్చారు. సంస్థ భవిష్యత్తుపై కార్మిక సంఘాల నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఏ ఒక్క డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించబోమని సీఎం హామీ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన కాలానికి సంబంధించి 3 రోజుల వేతనాన్ని తక్షణమే చెల్లించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమ్మె సమయంలో కార్మికులపై నమోదైన కేసులను ఎత్తేస్తామన్నారు. నవీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, ......2......లో

## వద్దని బతిమాలినా ఆరు ముక్కలు చేశారు

కేసీఆర్‌పై కడియం శ్రీహరి ఆగ్రహం

- వద్దని బతిమాలినా, వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశారన్న కడియం
- పైకి వరంగల్ జిల్లా అని చెప్పుకోవడం తప్ప మిగిలిందేమీ లేదన్న కడియం శ్రీహరి
- కేసీఆర్ అహంకారం నచ్చకపోవడం వల్లే నాయకులు దూరం జరుగుతున్నారని వ్యాఖ్య
- నాడు రాజీనామా చేయకుండా బీఆర్ఎస్‌లో చేరిన వారికి కేసీఆర్ మంత్రి పదవులు ఇచ్చారని ఆగ్రహం



వరంగల్ ,హైదరాబాద్ పల్స్

వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరుముక్కలు చేశారని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. జిల్లాను ముక్కలు చేయవద్దని తాను బతిమాలినప్పటికీ, ఆరు ముక్కలు చేసి ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ......2......లో



## టీఆర్ఎస్ గూటికి బోడ జనార్ధన్...

- కవిత పార్టీలోకి మొదలైన చేరికలు టీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్టు
- ప్రకటించిన జనార్దన్
- టీడీపీ నుంచి వరుసగా నాలుగు సార్లు గెలిచిన ఘనత



## అమరావతికి నిధుల కేటాయింపుపై సజ్జల ఆగ్రహం

- అమరావతి పనుల కోసం రూ. 2,400 కోట్ల నిధుల మంజూరు
- భవనాల అలంకరణకు ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారని మండిపాటు
- సొంత ప్రయోజనాల కోసం చంద్రబాబు నిధులు మళ్లిస్తున్నారని ఆరోపణ

## నా బయోపిక్ నేనే తీస్తా



- నా బయోపిక్ తీయాలని ఉంది.. నేనే తీస్తా: మల్లారెడ్డి
- పవన్ సినిమాలో విలన్ పాత్ర కోసం తనను సంప్రదించారన్న మల్లారెడ్డి
- విలన్ అంటే హీరో చేతిలో తన్నులు తినాలని.. అది తనకు ఇష్టం లేదని వ్యాఖ్య
- తన పాత్రకు ఏ హీరో సెట్ అయితే ఆయనను తీసుకుంటామని వెల్లడి

## వాణిజ్య సిలిండర్ ధరల పెంపు

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం

- అంతిమంగా సామాన్యుడిపై భారం పడుతుందని ఆందోళన
- హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులకు ఆర్థిక భారమన్న మంత్రి
- ఎన్నికల తర్వాత ధరల పెంపు మోసం చేయడమేనని వ్యాఖ్య



## బెంగాల్ లో నేడు 15 చోట్ల రీపోలింగ్...



## పెండింగ్ చలాన్ల పేరుతో మళ్లీ బండి జప్తు

హోం సెక్రటరీ, డీజీపీలకు హైకోర్టు నోటీసులు




- వాహనాలు సీజ్ చేయవద్దంటూ గతంలోనే హైకోర్టు ఆదేశాలు
- హైకోర్టు ఆదేశాలను పాటించకుండా వాహనాలు సీజ్ చేస్తున్న పోలీసులు
- హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన బాధితుడు

## మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే

- ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం
- అలవాటుగా మారిందని విమర్శ
- రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్న కేటీఆర్
- కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డికి పట్టడం లేదన్న కేటీఆర్
- రాహుల్ గాంధీ ఆటో ఎక్కితే, ఆ డ్రైవర్ తన రెండు ఆటోలు అమ్ముకున్నాడని వ్యాఖ్య




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో

## శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తాం

నూతన డీజీపీ సీవీ ఆనంద్

- నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్
- డీజీపీ ఆఫీసులో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు
- రాష్ట్రంలో శాంతి భద్రతల నియంత్రణకు అహర్నిషలు కృషి చేస్తానని వెల్లడి



## భారత్ పై భారీ ఉగ్రదాడికి పాక్ కుట్ర!

అధ్యక్ష పీఠంపై అసిమ్ మునీర్ కన్ను.

- జమ్మూకశ్మీర్‌లో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ సైన్యం కుట్ర పన్నుతున్నట్టు నిఘా వర్గాల సమాచారం
- భారత్ ప్రతీకార దాడి చేసేలా రెచ్చగొట్టి, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే అసలు లక్ష్యం
- పాక్ సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్ తన అధ్యక్ష పదవి ఆకాంక్షల కోసమే ఈ ప్లాన్ చేస్తున్నట్టు విశ్లేషణలు
- స్థానిక యువతతో దాడులు చేయించి, తర్వాత పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు రెండంచెల వ్యూహం

హైదరాబాద్ పల్స్,డెస్క్

భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని విశ్వసనీయ నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్ ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ......2......లో




## వైసీపీ అధినేతకు మానసిక సమస్య ఉంది

- మేడే కార్యక్రమం వేదికగా వైసీపీపై ని సీఎం తీవ్ర విమర్శలు
- అది వైసీపీ కాదు గొడ్డలి పార్టీ అని ఎద్దేవా ఎన్నికల హామీ మేరకు విద్యుత్ ఛార్జీల తగ్గింపు
- పవన్, లోకేష్‌ల పనితీరుపై సీఎం ప్రశంసలు
- ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల నుంచే నివేదికలు స్వీకరిస్తామని ప్రకటన



హైదరాబాద్ పల్స్,అమరావతి

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ఏర్పాటు చేసిన 'ప్రజా వేదిక' సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఉన్నది వైసీపీ కాదని, అదో గొడ్డలి పార్టీ అని సంచలన వ్యాఖ్యలు

### వద్దని బతిమాలినా

## ఆరు ముక్కలు చేశారు

మొదటి పేజీ తరువాయి

పైకి వరంగల్ జిల్లా అని చెప్పుకోవడం తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ అహంకారం నచ్చకపోవడంవల్లే కొందరు నాయకులు దూరంగా ఉంటున్నారని అన్నారు.కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 36 మంది ఎమ్మెల్యేలను ఇతర పార్టీల నుంచి చేర్చుకున్నారని విమర్శించారు. పార్టీలో చేరిన వారు ఎవరూ రాజీనామా చేయకపోయినప్పటికీ మంత్రి పదవులు ఇవ్వలేదా అని ప్రశ్నించారు.మీరు చేస్తే రాజకీయం, ఇతరులు చేస్తే వ్యభిచారమా అని నిలదీశారు. ఇది కేసీఆర్ నేర్పిన విద్యే అన్నారు. కేసీఆర్ తీరు నచ్చకపోవడం వల్లే ఆయన నాయకత్వం నుంచి చాలామంది బయటకు వస్తున్నారని అన్నారు. కేసీఆర్ అహంకారం ఎవరికీ నచ్చడం లేదని అన్నారు.

## వాణిజ్య సిలిండర్ ధరల పెంపు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలు పెంచడం వల్ల ఆ ప్రభావం అంతిమంగా సామాన్యుడిపై పడుతుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచారని, దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, వీధి వ్యాపారులు, బేకరీలపై పెను భారం పడుతుందని అన్నారు. ఇది సామాన్యులకు ఆర్థిక భారమే అన్నారు.ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడమంటే ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఈరోజు భారీగా పెరిగిన విషయం తెలిసిందే.

## నా బయోపిక్ నేనే తీస్తా

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాజకీయాల్లో తనదైన ట్రేడ్ మార్క్ స్పీచ్‌లతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఇప్పుడు సినిమాల గురించి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన జీవితకథను సినిమాగా తీయాలని ఉందని... ఆ సినిమాను తానే తీస్తానని ఆయన అన్నారు.పవన్ కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'లో విలన్ పాత్ర కోసం తనను సంప్రదించారని... తాను ఒప్పుకోలేదని మల్లారెడ్డి చెప్పారు. విలన్ అంటే హీరో చేతిలో దెబ్బలు తినాల్సి ఉంటుందని, వేలాది మంది తన విద్యార్థులు, అభిమానుల ముందు అలా కనిపించడం తనకు ఇష్టం లేదని ఆయన స్పష్టం చేశారు.తాను త్వరలోనే సినిమాల్లోకి వస్తానని మల్లారెడ్డి తెలిపారు. తన పాత్రకు ఏ హీరో సెట్ అవుతారని డైరెక్టర్ చెబుతారో ఆయననే తీసుకుంటామని... ఆ సినిమాలో తాను కూడా ఒక ప్రధాన పాత్రలో నటిస్తానని చెప్పారు.

## టీఆర్ఎస్ గూటికి బోడ జనార్దన్...

మొదటి పేజీ తరువాయి

కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్ లోకి చేరికలు మొదలయ్యాయి. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ టీఆర్ఎస్ లో చేరనున్నారు. ఈరోజు బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో కవితతో జనార్ధన్ భేటీ అయ్యారు.కవితతో భేటీ అనంతరం బోడ జనార్దన్ మాట్లాడుతూ, త్వరలోనే తన అనుచరవర్గంతో కలిసి అధికారికంగా పార్టీలో చేరతానని వెల్లడించారు. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా పేరుగాంచారు. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

## అమరావతికి నిధుల కేటాయింపుపై సజ్జల ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

అమరావతి అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర కేబినెట్ దాదాపు రూ. 2,400 కోట్ల నిధులు మంజూరు చేయడంపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శలు గుప్పించారు. కేబినెట్ నిర్ణయాలు విచిత్రంగా ఉన్నాయని, ఇవి కేవలం చంద్రబాబు గారి 'సంపద సృష్టి' కోసమే తప్ప ప్రజల కోసం కాదని ఆయన ఆరోపించారు. సచివాలయ భవనాల గ్లాస్ క్లాడింగ్ వంటి పనుల కోసం రూ. 2,400 కోట్లకు పైగా కేటాయించడమేంటని సజ్జల విస్మయం వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని కేవలం భవనాల అలంకరణకే ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు.ఒకవైపు రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్వహణకు నిధులు లేవని చెబుతూ వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్న ప్రభుత్వం, మరోవైపు రాజధాని భవనాల కోసం వేల కోట్లు ఎలా ఖర్చు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. అమరావతిని 'భ్రమరావతి'గా అభివర్ణిస్తూ, చంద్రబాబు తన సొంత ప్రయోజనాల కోసం కృష్ణా నదిలా నిధులను అక్కడికి మళ్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. భూములు దోచుకునే బరితెగింపు పెరిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### భారత్‌పై భారీ

## ఉగ్రదాడికి పాక్ కుట్ర!

మొదటి పేజీ తరువాయి

ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు.దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు.ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీనివల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికి పాల్పడటం వారి వ్యూహంలో భాగం.ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా ఫర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, ఆయనకు కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని విశ్లేషకులు చెబుతున్నారు.

## మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే

మొదటి పేజీ తరువాయి

ఎన్నడూ లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు.అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు.హామీల గురించి అడిగితే బూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎలాగూ మరోసారి ముఖ్యమంత్రి కాబోరని, కానీ ఉన్నన్నాళ్లైనా నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి లెక్కలేదని అన్నారు.రాహుల్ గాంధీ అడుగు పెడితే ఉన్న ఆటోలు అమ్ముకున్నాడు.తాను కొన్ని కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయం వద్ద కారు అందుబాటులో లేకపోవడంతో మష్రత్ అలీ అనే వ్యక్తి ఆటోను ఎక్కానని తెలిపారు. ఆ సమయంలో ఆయనతో మాట్లాడానని, ఆయన చెప్పిన విషయాల విని ఆందోళన చెందానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే మష్రత్ అలీ ఆటోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కారని, ఆ సమయంలో అతనికి రెండు ఆటోలు ఉండేవని చెప్పారు. రాహుల్ గాంధీ ఎక్కిన తర్వాత ఆయన తన ఆటోలను అమ్మేసుకుని కిరాయి ఆటో నడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కొందరి అడుగు అలా ఉంటుందని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు.

### పెండింగ్ చలాన్ల పేరుతో

## మళ్లీ బండి జప్తు

మొదటి పేజీ తరువాయి

పెండింగ్ చలాన్లు ఉన్నాయనే నెపంతో వాహనాలను జప్తు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. న్యాయస్థానం గతంలో జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నందుకు గాను ఉన్నతాధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది.పెండింగ్ చలాన్లు ఉన్నంత మాత్రాన పోలీసులు వాహనాలను సీజ్ చేయకూడదని గతంలోనే హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే, ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పోలీసులు ఇంకా వాహనాలను జప్తు చేస్తున్నారని ఒక బాధితుడు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం... రాష్ట్ర డీజీపీ, హోం శాఖ కార్యదర్శి, అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్ లకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాహనాలను ఎందుకు సీజ్ చేస్తున్నారో తెలపాలని, దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.అధికారుల వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను జూన్ 19వ తేదీకి వాయిదా వేసింది. పెండింగ్ చలానాల విషయంలో పోలీసులు కేవలం చట్టపరంగా జరిమానా వసూలు చేయాలి తప్ప, వాహనాన్ని స్వాధీనం చేసుకునే హక్కు లేదని ఈ పరిణామం ద్వారా మరోసారి స్పష్టమైంది.

## శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తాం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తామని చెప్పారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల్లో సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండటం మంచిదని అన్నారు.

నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పనితీరు కనబరిచారని ఆయన తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లానే నేరాలు జరిగే తీరులోనూ మార్పులు వస్తున్నాయన్నారు. నేరగాళ్లు కొత్త కొత్త టెక్నాలజీని వాడుతూ, మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వారు అనుసరిస్తున్న టెక్నాలజీ పోలీసులకు కూడా సవాలు విసురుతుందని చెప్పారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుంది**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తుందన్నారు. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే ఆ కేసు గురించి తనకు తెలుసని ఆయన వివరించారు. త్వరలో ఫోన్ ట్యాపింగ్ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని సీవీ ఆనంద్ తెలిపారు.అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి డీజీపీ కార్యాలయంలో సీవీ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. డీజీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీవీ ఆనంద్‌కు పోలీసుశాఖ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

**కీలక విభాగాల్లో సేవలు**

1991 ఐపీఎస్ బ్యాచ్‌నకు చెందిన సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఇటీవలే పదోన్నతి పొందారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా(డీజీపీగా)బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పోలీస్ శాఖలోని పలు కీలక విభాగాల్లో సేవలందించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో పనిచేశారు. ఇంతవరకు డీజీపీగా ఉన్న శివధర్ రెడ్డి పదవీకాలం గురువారంతో ముగియడంతో సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నూతన పోలీస్ బాస్‌గా నియమించింది.ఇటీవలే యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యామిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యం నుంచే ఎంతో క్రమశిక్షణగా పెరిగారు. తండ్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వ అధికారి కావడంతో పరిపాలనపై చిన్ననాటి నుంచే అవగాహన ఏర్పడింది. ప్రముఖ స్కూళ్లలో ఒకటైన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యను పూర్తి చేశారు. అనంతరం 1991లో సివిల్స్ పరీక్ష రాసి ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు.

## వైసీపీ అధినేతకు మానసిక సమస్య ఉంది

మొదటి పేజీ తరువాయి

చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు రాజకీయాలకు పనికిరారని, వైసీపీ అధినేతకు మానసిక సమస్యలు ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. తాము ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను రెండు గంటల్లో కూల్చివేయడమే వారి విధ్వంసకర మనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. తాము రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే, ఆ పార్టీ అధికారంలోకి వచ్చి విధ్వంసం సృష్టించిందని మండిపడ్డారు.గడచిన 22 నెలలుగా తమ కూటమి ప్రభుత్వం.. గత పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను పునర్నిర్మిస్తూ ఏపీకి పునర్వైభవం తెచ్చేందుకు కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తున్నామని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఛార్జీలు పెంచబోమని మరోసారి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజలపై ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపిందని ఆయన గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పనిచేస్తోందని, ప్రజలిచ్చే సహకారమే తమకు పెద్ద శక్తి అని అన్నారు.కూటమి ప్రభుత్వంలో భాగస్వాముల పనితీరును సీఎం అభినందించారు. పంచాయతీరాజ్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మార్పులు తీసుకొచ్చారని, విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ సంస్కరణలు అమలు చేసి పదో తరగతిలో విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించేలా చేశారని ప్రశంసించారు. ఇక నుంచి ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల నుంచి నేరుగా సమాచారం తీసుకుంటానని కీలక ప్రకటన చేశారు. తాను టీమ్ లీడర్‌గా ఉన్నానని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని హితవు పలికారు.అంతకుముందు, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అత్యుత్తమ సేవలు అందించిన కార్మికులకు, ఉత్తమ యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ లో నేడు 15 చోట్ల రీపోలింగ్...

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. మగ్రాహట్ (పశ్చిమ్), డైమండ్ హార్బర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని శుక్రవారం ఆదేశించింది. పోలింగ్ రోజున ఈ కేంద్రాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.ఏప్రిల్ 29న రెండో దశలో పోలింగ్ జరిగిన ఈ నియోజకవర్గాల్లో శుక్రవారమే రీపోలింగ్ జరగనుంది. రీపోలింగ్ జరగనున్న 15 బూత్‌లలో 11 మగ్రాహట్ (పశ్చిమ్) నియోజకవర్గంలో ఉండగా, మిగిలిన 4 డైమండ్ హార్బర్ పరిధిలో ఉన్నాయి.ఇదిలా ఉండగా, ఇదే జిల్లాలోని ఫల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా దాదాపు 30 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ జరిగే అవకాశం ఉందని ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ వర్గాలు సూచిస్తున్నాయి. ఫల్టాలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పేరు, గుర్తు పక్కన ఉన్న ఈవీఎం బటన్ పనిచేయడం లేదని వచ్చిన ఫిర్యాదులపై ఈసీఐ సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈసీ నియమించిన ప్రత్యేక పరిశీలకుడు సుబ్రత్ గుప్తా స్వయంగా గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి, విచారణ జరిపారు. సుదీర్ఘ విచారణ అనంతరం, ఆయన ఫల్టాలోని 30 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.గతంలో ఫల్టా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్ జరపాలని బీజేపీ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 29న పోలింగ్ జరగడానికి ముందు నుంచే ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పోలింగ్ రోజున కూడా అక్కడక్కడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.

## ఆర్టీసీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ఆర్టీసీని ఆధునీకరించే క్రమంలో రెండు భారీ బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు చేస్తామని సీఎం ప్రకటించారు. గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మాణం చేపడతామన్నారు. అలాగే బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో మరో నూతన బస్ టెర్మినల్ ఏర్పాటు చేస్తామన్నారు. డీజిల్ ఖర్చును తగ్గించి, సంస్థను లాభాల బాట పట్టించేందుకు 1000 కొత్త ఎలక్ట్రిక్ (జుఎ) బస్సులను కొనుగోలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఈ బస్సులను మెట్రో ట్రైన్, ఎంఎంటీఎస్ (వీమీూ) సర్వీసులతో అనుసంధానించడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వంలో సంస్థ విలీనం ప్రక్రియపై సమగ్ర కార్యాచరణతో రావాలని కార్మిక సంఘం నాయకులకు సీఎం సూచించారు. ఉద్యోగుల వేతన సవరణ (ృా=జ) అంశాన్ని ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని, సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకొకసారి కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీకి ఆదరణతో పాటు ఆదాయం కూడా పెరిగిందని సీఎం హర్షం వ్యక్తం చేశారు. సంస్థకున్న అప్పుల పునర్వ్యవస్థీకరణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# రికార్డులను తిరగరాసేసిన రాజపేట పీఎం శ్రీ పాఠశాల

**హెచ్ఎం తడ్కరాజు ఆధ్వర్యంలో అద్భుత ఫలితాలు**
**ప్రత్యేకంగా అభినందించిన డీఈవో కందుల సత్యనారాయణ**
**ఫలితాలు, పథకాలు, విద్య బోధన ప్రచారాలతో బడిబాట**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎస్సి అత్యుత్తమ ఫలితాలతో జిల్లాలోని ప్రత్యేక పాఠశాలగా గుర్తింపు పొందింది. జిల్లాలోని 27 పీఎం శ్రీ పాఠశాలల్లో రాజపేట పాఠశాల మెరుగైన అద్భుత ఫలితాలతో జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ చే ప్రశంసలు అందుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నూరు శాతం ఉత్తీర్ణత అత్యధిక మార్కులతో ప్రధానోపాధ్యాయులు తడక రాజు ఉపాధ్యాయ బృందం శ్రమ ఫలితాలు కనిపించాయి. గత ఏడాది 84 మంది పరీక్షకు హాజరై నూరు శాతం ఉత్తీర్ణత పొందగా ఈసారి 86 మంది పరీక్షకు హాజరై పూర్తి విద్యార్థులు అత్యుత్తమ మార్కులు దక్కించుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 18 మంది 500 కు పైగా మార్కులు సంపాదించుకున్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు ఎం. రాజేశ్వరి, మాధవి, హిందీ పి.జె పత్రాసియా, ఇంగ్లీష్ సౌజన్య, శ్యాంసుందర్, గణితం జే ప్రభాకర్ సునీత, శ్రీదేవి, ఫిజికల్ సైన్స్ దుడుక జానయ్య, ఇప్ప సంజీవులు, ఫిజికల్ సైన్స్ అనిత, నిర్మల, సోషల్ బి.లెనిన్, కే.అరుణకుమారి లు చక్కటి విద్యా బోధన చేయడంతో ఫలితాలు సాధించారు. ప్రధానోపాధ్యాయులు తాడ్కరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ, ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత పరిశీలన, నిత్యం పర్యవేక్షణ, ఉదయం సాయంత్రం వేళలో ప్రతి విద్యార్థిని గమనిస్తూ చూపిన శ్రద్ధతో మంచి ఫలితాలకు బాటలు వేశాయి. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, పాఠశాలలో వసతులు, ఉత్తమ ఫలితాలు, చక్కటి ఉపాధ్యాయుల చే బోధన విషయాలతో ప్రచారాస్త్రాలుగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విద్యార్థులను చేర్చుకునే కార్యక్రమాలను తడక రాజు బృందం చేపట్టారు. రాజపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాల ఆదర్శవంతంగా నిలిచిందని డీఈఓ కందుల సత్యనారాయణ, ఎంఈఓ చందా రమేష్



ప్రశంసించారు.

# రాజపేట మండలంలో ఘనంగా మేడే ఉత్సవాలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మే డే కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజపేట మండలంలో వివిధ కార్మిక సంఘాలు ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నాయి. ప్రదర్శనలు నిర్వహించి జండా ఆవిష్కరణలు చేసి సమావేశాలు నిర్వహించుకున్నారు. ఉద్యోగ భద్రత కోసం మే డే స్ఫూర్తితో పోరాటం చేద్దామన్నారు.అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బూర్గు స్వప్న మాట్లాడుతూ.... ప్రభుత్వ ప్రైవేటు సెక్టర్ లో పనిచేసే కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వాలపై మేడే స్ఫూర్తితో పోరాటాల్లో పాల్గొనాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బూరుగు స్వప్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సిఐటియు జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ..... ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల స్థితిగతులు మాత్రం మారడం లేదని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశ వైఖరితో ఉందని కేంద్ర ప్రభుత్వ స్కీములో పనిచేసే అనేకమంది కార్మికులు ఉద్యోగ భద్రత లేక పనికి తగ్గ వేతనం లేక దినదిన గండంగా జీవితాలను గడుపుతున్నారని దీనికి తోడుగా నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చి కార్మికుల పొట్ట గొట్టాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం చూస్తుందని అన్నారు. పోరాటాలు చేయకుంటే ప్రభుత్వం మరింత నిరంకుశత్వానికి తెగబడుతుందని మేడే స్ఫూర్తితో ఉద్యోగ భద్రత కోసం కనీస వేతనాల కోసం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, బీడీ కార్మిక సంఘం జిల్లా నాయకులు పబ్బోజు రాధమ్మ, ప్రజా సంఘాల కటికల రామచంద్రం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోట రవికుమార్ అంగన్వాడి నాయకులున్నారు. లిసిపిఐ ఆధ్వర్యంలో రాజపేట మండలం చల్లూరు గ్రామంలో మేడే ఉత్సవాలులి ఘనంగా జరుపుకున్నారు భవన నిర్మాణ కార్మిక హమాలీ కార్మిక, కర్షక సంఘాలు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి



కళాకారులచే ఆటపాటలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం, మండల అసిస్టెంట్ సెక్రటరీ ఇంజ హేమలత, మూల పోచయ్య, గౌరవ అధ్యక్షులు గంధమల్ల కృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు కూతురు నరసింహులు, గుంటి యాదగిరి, తోట్ల మల్లేశం, గుమ్ముల నాగేందర్, గుమ్ముల ప్రభాకర్, ఉచ్చేంతల రామకృష్ణ, కూతురు వెంకట్ నరసయ్య, గడ్డల బిక్షపతి, హమాలీ సంఘం అధ్యక్షుడు కోట మల్లేశం, ఉపాధ్యక్షుడు వర్కల ఐలయ్య, బొడ్డు సురేష్, భవన కార్మిక సంఘం అధ్యక్షుడు ఉచ్చంతల రాజు, సీనియర్ నాయకుడు దొంతుల పోచయ్య, తదితరులు అన్ని వర్గాల పేద ప్రజలు పాల్గొని అంగరంగ వైభవంగా సంబరాలు జరుపుకున్నారు.ఖ

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో బీర్ల ఐలయ్య పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా విశేష అలంకరణతో స్వామి, అమ్మవార్లను అలంకరించి, పుణ్యవాహచనం, వ్రతాలు, కన్యాదానం, మంగళసూత్రధారణ, తాళంబ్రాలు వంటి పావనమైన తంతువులు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే భక్తి భావంతో పాల్గొని ప్రత్యేక హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.... శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని



ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సాంప్రదాయాలను పరిరక్షించేలా దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బస్సు తనిఖీలో ఉద్రిక్తత.. టికెట్ తనిఖీ అధికారిపై దాడి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, రాయికోడ్ :** జహీరాబాద్ నియోజకవర్గంలో రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధుల్లో భాగంగా బస్సు తనిఖీ చేస్తున్న ఆర్టీసీ టికెట్ తనిఖీ అధికారులపై బస్సు కండక్టర్ దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఝరాసంగం మండలం కప్పాడు వద్ద నారాయణఖేడ్ డిపోకు చెందిన టీజీ15జెడ్0082 బస్సును టిటిఐ ఏసయ్య, టిటిఐ ప్రకాశ్, డ్రైవర్ ప్రతాప్ కలిసి తనిఖీ చేయగా ఒక ప్రయాణికునికి మహిళలకు ఉచిత ప్రయాణం కోసం జారీ చేసే జీరో ఎంహెచ్‌సీ టికెట్ ఇచ్చి రూ.20 వసూలు చేసినట్లు గుర్తించారు. దీనిపై కండక్టర్ వసంత్‌కు చార్జి మెమో జారీ చేయగా అతడు సంతకం చేయకుండా ఆగ్రహంతో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. అనంతరం ప్రయాణికులను రెచ్చగొట్టి టిటిలపై చెప్పులతో దాడి చేయడంతో పాటు చార్జి మెమో బుక్ మరియు సంబంధిత టికెట్‌ను చించివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో టిటిఐ ఏసయ్యకు ఎడమ చేతి బొటనవేలికి, టిటిఐ ప్రకాశ్‌కు నుదిటిపై గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కండక్టర్ వసంత్‌తో పాటు సంబంధిత ప్రయాణికులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయికోడే పోలీసులు తెలిపారు




# ఇండ్ల మధ్యలో ఎగసిపడిన మంటలు

**సకాలంలో స్పందించిన పోలీసు, తహసిల్దార్ బృందం**
**ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా తప్పిన ప్రమాదం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు నివాస గృహం సమీపంలో ఖాళీ మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్ వల్లపు ప్రదీప్, ఎస్ఐ లింగారెడ్డి, ఆర్ఐ నర్సింలు బృందం హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాజపేట సర్పంచి కోయ మధు, ఉపసర్పంచి నమిల కేదారి, వార్డు సభ్యులు గుర్రం శ్రవణ్ సమీప నివాసితులు నీళ్లు చల్లి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. రాజపేట గ్రామపంచాయతీ నీళ్ల ట్యాంకర్ తో పాటు పరిసర మూడు గ్రామాల నీళ్ల ట్యాంకర్లు సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశాయి. తహసిల్దార్, ఎస్ఐ ల సమాచారం మేరకు ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకోగా ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. దీంతో సమీప గృహాలకు మంటలు వ్యాప్తి చెందకుండా ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు మూడు గంటల పాటు రెవెన్యూ, పోలీసు సిబ్బంది గ్రామస్తులు శ్రమపడి మంటలను ఆర్పి వేశారు. ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# ఎల్లమ్మ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ నివాస గృహంలో ఎల్లమ్మ పండుగ సాంప్రదాయంగా ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, ఆలేరు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, రాజపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఐటిసి పేపర్ పరిశ్రమ నందు ప్రపంచ కార్మికుల దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01 భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** ఐటీసీ పీఎస్పీడీ భద్రాచలం యూనిట్ ప్రధాన గేట్ ఆవరణలో గల కార్మికుల జెండా దిమ్మెల వద్ద ప్రపంచ కార్మికుల దినోత్సవం ను పురస్కరించుకుని ఐడియల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు జనాబ్ అబ్దుల్ అలీమ్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ అబ్దుల్ సాబీర్ మాట్లాడుతూ ఎన్నో మంది కార్మిక వీరుల త్యాగాల ఫలితమే ఈరోజు మనం జరుపుకుంటున్న కార్మికుల దినోత్సవమని, ప్రపంచవ్యాప్తంగా దీనిని ఘనంగా జరుపుకోవడం కార్మిక ఐక్యతకు ప్రతీక అని తెలిపారు. అదేవిధంగా 14వ వేతన ఒప్పందం చివరి దశలో ఉన్న నేపథ్యంలో 22,000 ప్యాకేజీ సాధించాల్సిన అవసరం ఉందని మెడికల్ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని కాంట్రాక్ట్ కార్మికులకు జాబ్ క్యాలెండర్ తీసుకువచ్చి పర్మనెంట్ పాలసీ రూపొందించాలని బదిలీ కార్మికులను పర్మనెంట్ చేయాలని రిటైర్డ్ కార్మికులకు పూర్తి బెనిఫిట్స్ యాజమాన్యమే భరించాలని కాలనీ క్వార్టర్స్‌ను ఒకేసారి ప్రారంభించాలని ఇప్పటికే యాజమాన్యానికి అందించిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్లో ఒక్క అంశంపైనా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు షేక్ షా వలి, వైస్ ప్రెసిడెంట్లు తాజుద్దీన్, యూసుఫ్ భాయ్, యూనియన్ సభ్యులు, కార్మిక సహోదరులు పాల్గొన్నారు.

## పోలిసులకు, విలేకరులకు టోపీలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఎండ తీవ్రంత నుండి కొంత వరకు కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట లో పలువురి విలేకరులకు, పోలిసులకు తెల్ల టోపిలను పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులకు, విలేకరులకు ఈ టోపిలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తాజా గా తుర్కపల్లి మండలంలో పర్యటించిన సందర్భంలో పోలీసులకు, విలేకరులకు తెల్ల టోపిలు అందజేశారు. మిగతా మండలల్లో కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట పట్టణంలోని విజయాలక్ష్మి గార్డెన్స్‌లో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక శక్తివంతమైన సాధనమని తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చెందడంతో పాటు, పేద ప్రజలకు ఆర్థిక భద్రత లభిస్తోందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేసే వారధులుగా పనిచేస్తూ, పారదర్శకంగా మరియు నిబద్ధతతో తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఫీల్డ్ అసిస్టెంట్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి లక్ష్యాల సాధనలో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలి : ఏఐటియుసి డిమాండ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురంభీం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో శుక్రవారం మే డే సందర్భంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్‌ల వల్ల ఉద్యోగ భద్రత తగ్గుతుందని, సమ్మె హక్కు పరిమితమవుతుందని, పని గంటలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా చట్టాలు తీసుకురావడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ కోడ్‌లను ఉపసంహరించకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్, కార్యదర్శి రత్నం దేవాజి, నాయకులు పాల్గొన్నారు.

## తుమిడిహేటి ప్రాణహిత వద్ద సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01,, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమిడిహేటి ప్రాణహిత నది వద్ద ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికపంత్, ఎమ్మెల్సీ దండే విఠల్ శుక్రవారం ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లు, భద్రత, పార్కింగ్, జనసమ్మేళనం నిర్వహణపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఎస్.ఎస్.సి ఫలితాలలో బీరంగూడ నారాయణ పాఠశాల 100% ఫలితాలతో ప్రభంజనం




**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01 :** బీరంగూడలోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల్లో వి మధురిమ రెడ్డి 595/600 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది పాఠశాలలో మొదటి స్థానంలో ప్రతిభనుచాటగా. చరిత 587 మార్కులతో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఇతర విద్యార్థులకు కూడా మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాల స్థాయిని నిలబెట్టారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ. పాఠశాల అందించిన నాణ్యమైన విద్య ఉపాధ్యాయుల కృషి కారణంగానే పిల్లలు ఈ స్థాయి ఫలితాలు సాధించారని అభిప్రాయపడ్డారు..ఈ సందర్భంగా పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం వేణుగోపాల్, ఆర్ఐ చక్రధర్, ఆర్ అండ్ డి. శ్రీలక్ష్మి, కోఆర్డినేటర్ బాలకృష్ణ, ప్రిన్సిపల్ శ్రీవిద్య అకాడమిక్ డీన్ నరసింహారావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ. వారి కృషి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయి అని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రశంసలు కురిపించారు. నారాయణ పాఠశాల చైర్మన్ రమాదేవి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు, ఈ ఫలితాలతో పాఠశాల తన ప్రతిభను మరోసారి చాటుకుంది.





## శ్రమశక్తి అవార్డు గ్రహీత కార్మిక నాయకులు యారం పిచ్చి రెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల మండలి సభ్యులు, రాష్ట్ర కార్మిక నాయకులు ఐ టి సి పి ఎస్ పి డి ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చి రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ మే డే సందర్భంగా అత్యున్నత ప్రతిష్టాత్మకమైన "శ్రమశక్తి పురస్కారం" ను కార్మిక శాఖ మంత్రి గెడ్డం వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా అందుకున్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం రాజీలేని పోరాటం చేస్తూ, నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు గాను ప్రభుత్వం వారి సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేయడం విశేషం. ఈ సందర్భంగా యారం పిచ్చి రెడ్డి మాట్లాడుతూ... ఈ రోజు నా జీవితంలో అత్యంత గొప్ప క్షణం. కార్మికుల ప్రతి శ్రమకు గుర్తింపుగా 'శ్రమ శక్తి అవార్డు' నాకు లభించిందని నేను భావిస్తున్నాను ఈ అవార్డు నాది మాత్రమే కాదు - ఇది మాన అందరిది మీ అందరి సహాయ సహకారంతోనే నాకు ఈ గొప్ప గుర్తింపు సాధ్యమైందని భావిస్తున్నాను కార్మిక నాయకుడిగా నేను మీతో పని చేస్తూ, మీ శ్రమను గమనిస్తూ, మీ ఆకాంక్షలకు సహాయం చేస్తూ యాజమాన్యంతో పోరాడుతున్నాను భవిష్యత్తులో కూడా కార్మిక శ్రేయస్సు కోసం నా ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతూనే ఉంటాను అని అన్నారు ఈ పురస్కారాన్ని నన్ను ఎంపిక చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను అన్నారు.



## భారత్ పై భారీ ఉగ్రదాడికి పాక్ కుట్ర.. మాస్టర్ మైండ్ మునీర్? : హెచ్చరించిన నిఘా వర్గాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01:**
పొరుగు దేశం పాకిస్థాన్ మరోసారి భారత్‌పై దుశ్చర్యకు ఒడిగట్టేలా కనిపిస్తోంది. తీవ్ర నిరాశలో ఉన్న పాక్ సైన్యం, భారత భూభాగంపై సాహసోపేతమైన దాడికి ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాల విశ్లేషణలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని, తద్వారా అమెరికాను ఈ వివాదంలోకి లాగాలని పాక్ ప్లాన్ చేస్తోందని షిల్లాంగ్ టైమ్స్ వెల్లడించింది.

పాక్ చిరకాల వాంఛే అసలు లక్ష్యం:
గతంలో 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్ ఏ విధంగానైతే ధీటుగా స్పందించిందో, ఇప్పుడు కూడా భారత్ అలాగే ప్రతీకారం తీర్చుకోవాలని పాక్ కోరుకుంటోంది. భారత్ ఎదురుదాడి చేస్తే, ఆ సాకుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్న సంబంధాలను వాడుకుని అంతర్జాతీయ జోక్యాన్ని కోరాలని పాక్ భావిస్తోంది. కాశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకురావాలనేది పాకిస్థాన్ చిరకాల వాంఛ. అయితే.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్ తమ అంతర్గత విషయమని భారత్ ఇప్పటికే ప్రపంచ దేశాలకు స్పష్టం చేసింది.

## సంగ్య తండా లో ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం జేతురం తండా గ్రామపంచాయతీ లోని సంగ్య తండాలో సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మే డే సందర్భంగా దినసరి ఉపాధి హామీ కార్మికులతో కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్ నాయక్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా తుర్కపల్లి మండలంలోని 250 మందికి పైగా కూలీలు వెళ్తున్న గ్రామపంచాయతీ జైతిరం తండా ప్రజలు, కార్మికుల హక్కులను, కార్మిక చట్టాలను, కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ ను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారు ఒక కార్మికుడు ఎన్ని గంటలు పని చేయాలి ఎంత వేతనం పొందాలి స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పించి వారి యొక్క ఆరోగ్య భద్రతను ప్రశుతి సెలవు దినాలను కార్మికుల హక్కుల చట్టాల కై అంబేద్కర్ ఎంతో కృషి చేసిన విషయం గుర్తు చేశారు, అలాగే కేంద్రంలో తెచ్చిన కొన్ని నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేసి కార్మికులకు కర్షకులకు వారి జీవన ఉపాధికి హక్కులకు భంగం కలవకుండా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, ఉపాధి హామీ సీనియర్ మేట్ మోహన్ నాయక్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పాశమైలారంలో మిన్నంటిన 'మే డే' ఉత్సాహం

**కార్మిక జెండాను ఆవిష్కరించిన నేత నర్రా బిక్షపతి**

**హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపు**



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01 :**
సంగారెడ్డి జిల్లా ఇస్నాపుర్ మున్సిపాలిటీ పాశమైలారం, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే)ను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్మిక నాయకులు నర్రా బిక్షపతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్మిక జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నర్రా బిక్షపతి మాట్లాడుతూ, ప్రపంచ గతిని మార్చే శక్తి కేవలం కార్మికులకే ఉందన్నారు. సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. కార్మికుల సంక్షేమం, భద్రత మరియు న్యాయమైన వేతనాల కోసం మన పోరాటం ఆగదు. హక్కుల సాధన కోసం ప్రతి కార్మికుడు ఐక్యతతో ముందుకు సాగాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మే డే పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, కార్మిక చట్టాల అమలు కోసం సంఘటితంగా ఉండాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఎర్రజెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పరిశ్రమల కార్మికులు మరియు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కార్మిక సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై పలు సూచనలు చేశారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి సన్మానం

**విద్యార్థిని సన్మానించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01 కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం ఇటిక్యాల పహాడ్ గ్రామానికి చెందిన గుర్నులే నాగేష్ కుమార్తె సువర్ణ సిర్పూర్ లోని ఆశ్రమ బాలికల పాఠశాలలో చవివి డివిజన్ స్థాయిలో మొదటి ర్యాంకు(537/600 మార్కులు) సాధించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు సన్మానించి అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటిడబ్ల్యూఓ రమాదేవి, హెడ్ మాస్టర్ కన్నయ్య మరియు ఆశ్రమ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ నివాస గృహంలో శుక్రవారం జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. గొంగిడి సునీత వెంట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు తదితరులున్నారు.

## శ్రమశక్తి అవార్డు అందుకున్న... ఇంజ మహేష్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రమశక్తి అవార్డు కు, యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇంజ మహేష్ మేడే పురస్కరించుకొని, గాంధీభవన్లో, ఐ ఎన్ టి యు సి - 327 సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ... ఈ అవార్డు ద్వారా మరింత బాధ్యత పెరిగిందని, కార్మికుల పక్షాన ఉండి పోరాడుతానని అన్నారు. అవార్డుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా అసద్ గంజ్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ 2006--07 పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం మే 01న ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామస్వామి, వసంత్ రావు, నరసింహారెడ్డి, అనంతరావు, మొహమ్మద్ సోఫీ ఖాన్ లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసద్ గంజ్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో మొదటిసారిగా ఈ సమ్మేళనం నిర్వహించడం పట్ల గురువులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, చిరంజీవి, బి. ప్రవీణ్ కుమార్, రమేష్, విల్సన్, లాలప్ప, అనిత, మమత, యాదమ్మ, మహానంద, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# హక్కుల రక్షణకు మరో పోరాటం చేయాలి

### లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు కార్మికులు పోరాడాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, నారాయణఖేడ్ :**
మే డే సందర్భంగా శుక్రవారం రోజు నారాయణాఖేడ్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మరియు బైపాస్ ఆటో యూనియన్ ఆక్సిజన్ పార్క్ వద్ద సీఐటీయూ జెండాలను పార్టీ ఆవిష్కరించాడం జరిగింది. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు నర్సింలు మాట్లాడుతూ దేశంలో ఎన్నో పోరాటాలు ఎంతోమంది ప్రాణాల బలిదానం మూలంగా వచ్చిన కార్మిక కర్షక హక్కులను, చట్టాలను ప్రజలు ఓట్ల ద్వారా ఎన్నుకున్న నెట్టి పాలకులు వాటిని రద్దు చేయడం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పట్ల వ్యతిరేక ప్రదర్శించడం చర్యను తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దేశంలోని కార్మికులకు రైతులకు వ్యవసాయ కూలీలకు ఏ ప్రభుత్వాలు తమ దయ దక్షిణాలతో హక్కులు ఇవ్వలేదని అన్నారు. కార్మిక, రైతు, కూలీల సమస్యల పరిష్కారం కోసం మే డే స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమాలు పోరాటాలు చేస్తామని, విలువైన ప్రాణాలు బలిదానం అయినా అమరవీరుల పోరాటాల స్ఫూర్తితో పోరాటాలు తెలిపిన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణాఖేడ్ సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ కార్మిక సంగం నాయకులు చిరంజీవి యూనియన్ మున్సిపల్ అధ్యక్షురాలు శకుంతల ఆటో యూనియన్ నాయకులు రాజు రవి శివకుమార్ రాజు యేసు సిద్దమ్మ నర్సమ్మ బేబీ తదితరులు పాల్గొన్నారు.



# రాజపేటలో యువకుడి హత్య..పారతో కొట్టి చంపిన తోటి స్నేహితుడు

**వెంటనే స్టేషన్ లో లొంగిపోయిన హత్య చేసిన నాని**
**సంఘటన స్థలాన్ని సందర్శించిన డి.ఎస్.పి. బృందం**
**రంగంలోకి దిగిన క్లూస్ టీం బృందం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న ఇంట్లో తాళ్లపల్లి మధు (20) ను తోటి స్నేహితుడు జిడ్డు నాని శుక్రవారం మధ్యాహ్నం పారతో తలపై తీవ్రంగా గాయపరిచి హత్య చేశాడు. దీంతో మధు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన నాని ఎలియాస్ ఉపేందర్ నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయాడు. సంఘటన స్థలంలో భోజనం చేస్తున్న ప్లేట్లు ఉన్నాయి. సరైన కారణాలు తెలియ రావడం లేదు. మృతుడు మధు హైదరాబాదులో నివాసం ఉంటూ ఇటీవల రాజపేటకు వచ్చాడు.



హత్య కాబడిన మద్దు హత్య చేసిన నాని లు ఇద్దరూ రంగులు వేస్తూ కూలీ పని చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ లింగారెడ్డి సంఘటన స్థలానికి హుటా హుటిన చేరుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస నాయుడు, యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ లు సంఘటన స్థలం వద్ద విచారణ జరిపారు. ఇద్దరూ భోజనం చేస్తున్న సమయంలో హత్య చేయడంపై, హత్యకు ఉపయోగించిన పార ఎక్కడి నుంచి తీసుకువచ్చాడనే విషయంతో పాటు పలు అంశాలపై విచారణ చేశారు. క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలు సేకరించారు. గతంలో నాని పై రెండు చోరీ చేసిన సంఘటనలు ఉన్నాయి. యువత చెడిపోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంఘటన స్థలానికి రాజపేట సర్పంచి కోయ మధు ఉపసర్పంచి నమిల కేదారి గౌడ్ పలువురు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు.



# ఉజ్వల భవిష్యత్తుకు బాల భరోసా ఒక వరం : జిల్లా కలెక్టర్ అంకిత్

### మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా బాల భరోస కార్యక్రమం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
శుక్రవారం స్థానిక జిల్లా కేంద్రం రామవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల భరోస కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలిదశలోనే గుర్తించి నివారించేందుకు 99 రోజుల ప్రజా ప్రణాళిక లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాల భరోసా కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, పిల్లల్లో ఉండే,న్యూరో డెవలప్మెంట్ నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలు,శారీరక ఎదుగుదల లోపాలు,మానసిక వికాసంలో ఆలస్యంవంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని , దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు. బాల భరోస కార్యక్రమం ముఖ్య ఉద్దేశ సకాలంలో జోక్యం అని పిల్లలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించి, ఆ సమస్య తీవ్రతరం కాకుండా చూడాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక మరి మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి, అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడం. చిన్నారులు ఆరోగ్యంగా, సంతోషంగా పెరిగేలా చూడటమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు అంగన్వాడి కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కె టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్లైన్ పోర్టర్లలో వివరాలను నమోదు చేయడం జరిగిందని, దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్మెంట్ శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి ఈరోజు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం ఈరోజు మాత్రమే చేసుకోకుండా సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు నిర్వహించుకోవాలని, అంగనవాడి టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు, ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ,సంతోషంగా సురక్షితమైన భవిష్యత్తును నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం జరిగింది. తదుపరి బేటి బచావో కార్యక్రమంలో భాగంగా భేటీ జన్మోత్సవ్ నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్,డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కె సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి. సంపత్, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు , అంగనవాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయాలి: జిల్లా కలెక్టర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ మాధురితో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన ఆయన, జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం పరిమాణం, ట్యాబ్ ఎంట్రీలు, కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, తేమ కొలిచే యంత్రాలు, రైతుల ఖాతాల్లో జమ అయిన చెల్లింపుల వివరాలను సమీక్షించారు. జిల్లాలో ప్యాక్స్, డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించగా, అన్ని కేంద్రాలను వెంటనే పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, గన్ని సంచులు, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు అనంతరం రైతుల ఖాతాల్లో చెల్లింపులు సకాలంలో జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మేడే స్ఫూర్తితో నూతన పోరాటాలకు సిద్ధం కావాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
చికాగో వీరుల త్యాగఫలం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అని, నాడు ఎనిమిది గంటల పనిదినం కోసం ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తితో హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలు సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం 141వ మేడే ఉత్సవాలు శుక్రవారం సిపిఐ, ఏఐటీయూసీ, అనుబంధ ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ప్రధాన కూడళ్ళు, హమాలీ అడ్డలు, ఆటో స్టాండ్‌లు, భవన నిర్మాణ కార్మిక క్షేత్రాలు, యూనియన్, పార్టీ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సాబీర్ పాషా ఎర్రజెండాను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్లో నిర్వహించిన భారీ ప్రదర్శన నిర్వహించారు. జెండావిష్కరణల అనంతరం జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్రంలోని పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దేశ ప్రయోజనాలకు విఘాతమని, ఈ దుర్మార్గపు విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. మేడే స్ఫూర్తితో అన్యాయమైన విధానాలను ఎదిరించి, పని భద్రత, కనీస వేతనాల సాధన కోసం మరో పోరాట దశకు కార్మిక వర్గం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా వ్యాపితంగా 723 కేంద్రాల్లో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించి చికాగో అమరవీరుల త్యాగాలు గుర్తుచేసుకున్నామని, కార్మికవర్గ పోరాటాలకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా నాయకులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి




మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, ఎస్ కె ఫహీమ్, కె రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, రాంచందర్, పొలమూరి శ్రీనివాస్, భాగం మాధవరావు, యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, ధనలక్ష్మి, కూరపాటి సుధాకర్, ధర్మరాజు, జహీర్, షాహీన్, మద్దాల హరిత, దాసరి శ్రీనివాస్, అస్మత్, ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక శక్తికి వందనం దేశ ప్రగతికి అభివందనం

## అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎండి షర్ఫుద్దీన్ అధ్యక్షతన ప్రపంచ కార్మిక దినోత్సవ మే డే వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
కార్మిక,ఉపాధి,శిక్షణ కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు. అసోసియేషన్ హాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని క్లాత్ మర్చంట్ అండ్ వెల్ఫేర్ కార్మిక ,ఉపాధి,శిక్షణ కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఐ ఎ యస్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎండి షర్ఫుద్దీన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులనుసాధించుకున్న మేడే రోజు కార్మికులు ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ ఇది అన్నారు. కార్మికులకు తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా కల్పిస్తున్న పధకాలు విధివిధానాలను గురించి వివరించారు. ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతు కార్మిక శక్తిని పెంచాలని ఉద్దేశంతో సాంకేతిక నైపుణ్యంతో కలిగిన కార్మికులను తయారు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు నేటి యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఏ టి సి ఐ టి ఐలలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరి నైపుణ్యమైన శిక్షణ పొంది మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. అదేవిధంగా కొత్తగూడెం ఏటీసీ కి చెందిన అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ డి హరీష్ కు ఉత్తమ సేవా అవార్డు అందించారు. కార్మికులు సైతం తమ హక్కులతో పాటు విధులను కూడా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ ఐటిఐ ఏ టి సి లకు చెందిన ప్రిన్సిపాల్ ఆయా కళాశాల అడ్మిషన్లకు



సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సహాయ కార్మిక అధికారులు బి ఎన్ రాజు, పి వి కే శాస్త్రి, ఐటిఐ ప్రిన్సిపాల్ ధర్మచారి, రవి విద్య శాఖ నుండి పై శ్రీనివాస్ లతోపాటు వివిధ కార్మిక సంఘాల నాయలు నారటీ ప్రసాద్, బి పరమేశ్, లక్ష్మణ్ నాయక్, పొగుల కోటేశ్వర రావు, చందరరావు, నరసింహ రావు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, నారాయణఖేడ్ :**
కల్హేర్ మండల కేంద్రంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో చాలామంది రైతులు జొన్నలు కందులు మొక్కజొన్న వంటి పంటలను పండించారని వాటిని ఈ ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మరి ముఖ్యంగా కల్హేర్ మండలంలో జొన్న పంటను అధికంగా పండించాలని వాటిని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కి మా ప్రాంతంలో అధికంగా జొన్నలు పండిస్తారు వాటిని కొనుగోలు చేయాలని కోరి నారాయణఖేడ్ నియోజకవర్గం లోనీ రైతులు పండించిన ప్రతి ఒక్క పంటని వాటికి మద్దతు ధర ఇచ్చి ప్రతి ఒక చివరిగింజా వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ ఒక్క పంటను కూడా కొనుగోలు చేయడం లేదని ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని పంటలను కొనుగోలు చేసి అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని అబద్ధాలు చెప్పి ఈ ప్రభుత్వం ఈ ఎమ్మెల్యే గద్దెనెక్కారని తెలిపారు.కొన్ని గ్రామాలలో రైతులు ఎమ్మెల్యే ని జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మా జొన్నలు కొనండి సార్ అంటే మేము కొనము మేము కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయమని మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తెరుకొని ఎమ్మెల్యే ఎంపీ గారు తెరుకొని నియోజకవర్గం లోని రైతుల వద్ద ఉన్న జొన్నలను కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతులకు మద్దతుగా అనేక రకాల పోరాటాలు చేస్తామని పంటలను ప్రభుత్వం కొనే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి మండల పార్టీ అధ్యక్షులు రామ్




సింగ్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్ వెంకట్ నాయక్, మాజీ సర్పంచ్ బాలయ్య, మాజీ ఉపసర్పంచ్లు సాయిలు, జయరాం, నాయకులు నారాయణ,నరసింహ గౌడ్, విటల్, లక్ష్మణ్ నాయక్, బాలయ్య, రవీందర్ రెడ్డి,మాణిక్ ప్రభు, పండరి, శంకర్ నాయక్, నల్గొండ, సాయి,చింటూ, తదితరులు ఉన్నారు.

# నీచ రాజకీయాలకు పాల్పడుతున్నా బిఆర్ఎస్ నాయకులు

## ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గురువారం రోజున బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు విషయం పట్ల రైతులను రెచ్చగొట్టి మతి భ్రమించి మాట్లాడిన సందర్భంగా శుక్రవారం రోజు తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ నాయక్ మాట్లాడుతూ... రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి నేనంటే నేను అని బిఆర్ఎస్ నాయకులు వారి స్వార్థ రాజకీయాలా ప్రయోజనాల గురించి అనవవసరంగా రైతులను ఉసిగొలిపి రోడ్డు ఎక్కించే ప్రయత్నం చేస్తూ వీరి రాజకీయ స్వార్థం కోసం రైతుల విలువైన సమయాన్ని వృధా చేస్తూ వారిని రోడ్లపాలు చేస్తున్నారు మరియు నోటికి ఎంతోస్తే అంత మాట్లాడుతూ అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను అగౌరవపరుస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలిపారు అదే విధంగా గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్ గా పనిచేసిన మీకు కనీస అవగాహన లేకుండా శిగ్గ శరం అనే బూతు మాటలు మాట్లాడడం ఎంతో సిగ్గుచేటుగా భావిస్తున్నాం అదేవిధంగా మూడు పంటలకు రైతు బంధు ఎగ్గోట్టిర్రని అసత్యమైన అర్థరహిత మాటలు మాట్లాడుతున్నారు ప్రజా ప్రభుత్వంలో తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయలు రైతులకు రైతు భరోసా అందించిన ఘనత మా రేవంత్ రెడ్డి ది గత మీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మొలకలు వచ్చేదాకా ధాన్యాన్ని తూకం వెయ్యకపోగా వేసినంక కూడా రెండు మూడు నెలల దాకా డబ్బులు పడకపోయేది ఆ సంఘటనలు మరిచి మతిభ్రమించి మా ప్రజా ప్రభుత్వం మీద అర్థరహితమైన విమర్శలు చేస్తూ రోడ్లెక్కి పత్రికల్లోకెక్కి ఉన్న ఆ కాస్త ఇజ్జత్ కూడా పోగొట్టుకుంటున్నారు ప్రజల్లోకి పోయే మొహం లేక ప్రజల సమస్యలను గుర్తించలేక ప్రజల ఆధరణ పొందుతున్న మా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మీద మా ప్రజా ప్రభుత్వం మీద ప్రభుత్వ యంత్రాంగం మీద అర్ధరహితమైన అసత్య ఆరోపణలు చేస్తున్నారు గతంలో మీరు ఆలేరు నియోజకవర్గానికి చేసిన అన్యాయాన్ని గుర్తించి ప్రజలు ఓట్ల రూపంలో బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టినా కూడా మీకు బుద్ధిలేక రోడ్లు ఎక్కి పత్రికల్లోకెక్కి మళ్ళీ ఓట్ల కోసం పాకులాడుతున్నారు ప్రస్తుతం మీ బిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ కోసం ముగ్గురు మూడు వర్గాలుగా ప్రయత్నం చేస్తూ ప్రజలకు, రైతులకు, మాయ మాటలు చెప్పి కృత్రిమ సమస్యలను సృష్టిస్తూ అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్న ఆలేరు నియోజకవర్గాన్ని ఆగం చేస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నారు గత మీ పాలనలో మన నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామానికైనా చెరువులు నింపిన దాకలాలు ఉన్నాయా కెసిఆర్ కాళేశ్వరం అనే మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారు తప్ప అభివృద్ధిలో మీరు ఓరుగపెట్టింది ఏమి లేదు ఇదే మా



ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తన సొంత నిధులతో నియోజకవర్గంలోని వందలాది చెరువులను నింపి పూర్తి స్థాయిలో పంటలు ఎండిపోకుండా చేసి రైతుల కళ్ళల్లో ఆనందాన్ని నింపాడు ఇకనైనా బుద్ధి తెచ్చుకో గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అవగాహన లేని మాటలు మాట్లాడకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు చాడ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సోమల్ల వెంకటేష్, చొక్ల తండా సర్పంచ్ రాజారామ్ నాయక్, ముల్కలపల్లి సర్పంచ్ భూలి వీరన్న, వాసాలమర్రి సర్పంచ్ అనురాధ బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మోహన్ బాబు నాయక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు రమేష్, మండల పార్టీ ఉపాధ్యక్షులు సుదర్శన్ గౌడ్, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులురాలు తుమ్మల మమత, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అరిగె మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ (ఎంఎల్) ఎన్‌డిఆర్ఎఫ్, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో 140వ మే డే




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరులోని పార్టీ కార్యాలయం వద్ద సిపిఐ (ఎంఎల్) ఎన్‌డిఆర్ఎఫ్, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో 140 మేడే కార్యక్రమం,పార్టీ ఆలేరు సబ్ డివిజన్ కార్యదర్శి అయిల రాములు అధ్యక్షత వహించి జెండ ఆవిష్కరించగా చికాగో నగరంలో రక్తాన్ని చిందించి అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయిల రాములు మాట్లాడుతూ.....కేంద్రంలో బిజెపి గవర్నమెంట్ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చింది కార్మికులు కొట్లాడు తెచ్చుకున్న హక్కులను కాలరాయడమేనని తెలిపారు. ఈ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు అయ్యేంతవరకు భారతదేశంలోని కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇఫ్ట్ నాయకులు జె.మల్లేష్, పి.రవి, పి.నాగరాజు, టి.శ్రవణ్, పి.సాయిలు, కే.సునిత, జే.అంజయ్య, జి.రమేష్, ఎన్.శ్రీనివాస్, జి.సత్తయ్య, పి.ప్రశాంత్, డి.అంజయ్య, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాయిదాలకు గైర్హాజరు...

## ఇద్దరిపై నాన్ బేలబుల్ వారెంట్ అమలు

**హైదరాబాద్ పల్స్, మే 01, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
విచారణకు సకాలంలో హాజరు కాకపోవడంతో ప్రమాద కేసులో నిందితులైన ఇద్దరిపై శుక్రవారం మహబూబాబాద్ అదనపు జెఎఫ్‌సీఎం కోర్టు నాన్ బేలబుల్ వారెంట్ జారీ చేసింది. డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని రామకుంట తండాకు చెందిన తేజావత్ మల్సూర్ (తండ్రి మీట్యా), తేజావత్ దస్రు (తండ్రి హల్యా)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డోర్నకల్ పోలీస్ స్టేషన్ అధికారి చంద్రమౌళి ఆదేశాల మేరకు, నిందితులను మహబూబాబాద్ కోర్టులో హాజరు పరచగా, కోర్టు ఆదేశాల ప్రకారం రిమాండ్‌కు తరలించారు. కోర్టు ఆదేశాలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని సిఐ చంద్రమౌళి తెలిపారు

# మేడే ను ఘనంగా నిర్వహించుకున్న ఫిమాకం ఎంప్లాయిస్ యూనియన్.




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
మేడే సందర్భంగా ఫిమాకం ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కడారు వెంకటేశ్వరరావు యూనియన్ జనరల్ సెక్రెటరీ పి వి వి ఎస్ ఎన్ వి ప్రసాద్ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులకు టీ షర్టులను యూనియన్ గుర్తుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనియన్ సభ్యులు ఎం.వి చిరంజీవి రావు, కే నాగేశ్వరరావు, యాగయ్య తదితరులు పాల్గొని జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అదేవిధంగా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ గడ్డం వెంకటేశ్వర్లు, ప్రెసిడెంట్ పాండవుల ఉపేందర్, లక్ష్మీనారాయణ, చందర్రావు, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కడారు వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జండాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆహ్వానితులు నల జాల సత్యనారాయణ, ఎస్ నాగేశ్వరరావు పాల్గొనడం జరిగింది.

# కొమరవెల్లి శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న వంగపల్లి అంజయ్య స్వామి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కొమరవెల్లి శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఆలేరు నియోజకవర్గం కాచారం శ్రీ వాసవి మాత, రేణుకా ఎల్లమ్మ, బసవలింగేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ... పవిత్ర వైశాఖ పౌర్ణమి సందర్భంగా మల్లికార్జున స్వామిని దర్శించుకుని అందరూ



బాగుండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు అంబటిపల్లి నాగరాజు, వనపర్తి సంతోష్, మహంకాళి నాగరాజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## చిన్నగౌరాయపల్లి లో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం చిన్న గౌరాయపల్లి గ్రామంలో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో 140 మేడే కార్యక్రమం గడ్డం యదగిరి అధ్యక్షతన జెండ ఆవిష్కరించగా చికాగో నగరంలో రక్తాన్ని చిందించి అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ..... కేంద్రంలో బిజెపి గవర్నమెంట్ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చింది కార్మికులు కొట్లాడు తెచ్చుకున్న హక్కులను కాలరాయడమేనని తెలిపారు. ఈ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు అయ్యేంతవరకు భారతదేశంలోని కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జనార్దన్, గడ్డం యాదగిరి, కల్లెపు అడవయ్య, కొంగరి సాయిరాం, ఎర్ర మల్లేశం, రాములు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు

## కొలనుపాకలో మేడే ఉత్సవాలు నిర్వహించిన కార్మికులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో శ్రీ సోమేశ్వర తాపీ కళాకారుల సంఘం, శ్రీ సోమేశ్వర గూడ్స్ వెహికల్ యూనియన్, బాబు జగ్జీవన్ రావ్ సెంట్రింగ్ వర్కర్ యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాలు ఎగరవేసి సీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సోమేశ్వర తాపీ కళాకారుల సంఘం అధ్యక్షులు మామిడాల సాగర్, ప్రధాన కార్యదర్శి బొంకూరి బుచ్చి రాములు, కోశాధికారి బొంకూరి వెంకటేష్, శ్రీ సోమేశ్వర గూడ్స్ వెహికల్ యూనియన్ అధ్యక్షులు గడ్డం శంకర్, ఉపాధ్యక్షులు నర్రరాజు, కోశాధికారి కోటగిరి మల్లికార్జున్, బాబు జగ్జీవన్ రావ్ సెంట్రింగ్ వర్కింగ్ యూనియన్ అధ్యక్షులు భామండ్లపల్లి మహేష్, ప్రధాన కార్యదర్శి పరిషలింగం, కోశాధికారి గంధమల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చర్ల మండలకేంద్రంలో ఘనంగా మేడే వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, భద్రాద్రి కొత్తగూడెం:**
శ్రీగణేష్ ఆటోయూనియన్ సిఐటియు ఆద్వర్యంలో చర్ల మండలకేంద్రంలో భారీ ఆటోర్యాలి నిర్వహించారు. వందలాది ఆటోలతో నృత్యాలు ఎర్రజెండా, పాటలతో అ త్యంతఉత్సహాంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సి.ఐ.టి.యు జెండాను యూనియన్ అధ్యక్షులు పామరు బాలాజి బస్టాండ్ సెంటర్ లో ఆవిష్కరించారు.ఈసందర్భంగా సిఐ.టి.యు.జిల్లా అద్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ కార్మిక పోరాటాలకు,త్యాగాల ప్రతీక మేడే అని అన్నారు.ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉచితబస్సు పథకం వల్ల ఆటోకార్మికులు ఉపాది కరువైందన్నారు.ఆటోకార్మికులు ప్రభుత్వ హామీప్రకారం 12000/-ఇవ్వాలనిడిమాండ్ చేశారు.గణేష్ ఆటోయూనియన్ కార్మికులు సిఐ.టియు జెండాలతో అలకరించిన ఆటోలతో చర్ల మండలకేంద్రం ఎరుపెక్కింది. ఎర్రజెమడా పాటలతో చర్ల కేంద్రం హోరెత్తిపోయింది. పోరాటాలద్వారానే హక్కుల రక్షించబడతాయని, సిఐ.టియు. జెండా కార్మికులకు కొండంత అండ అన్నారు. కార్యక్రమంలో శ్రీగణేష్ ఆటో యూనియన్ సిఐటియు గౌరవఅద్యక్షులు తెల్లమల్ల.అజయ్ కుమార్, కార్యదర్శి కోడిరెక్కల. నాగరాజు,ఉపకార్యదర్శి చల్లా. అశోక్ కుమార్,ఉపాద్యక్షులు దనసరి.సంపత్,బాలరాజుల.సత్తిరాజు,యూత్ ప్రెసిడెంట్ కంచర్ల. సతీన్,జింజిరాల తులసిరామ్, కోశాధికారి,కుక్కడపురాజబాబు,పాముల.పోతురాజు నాయకులు పొగాకు నాగేంద్ర కుమార్, కొంగా.రాజు, దొంతు.ప్రసాద్, వల్లెపోగు విజయ్, సంజీవ్ , వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

## 700 దేశీ దారు బాటిళ్ల స్వాధీనం.. ఇద్దరు నిందితులు అరెస్ట్

**అక్రమ మద్యం రవాణా విక్రయాలపై చట్టపరమైన చర్యలు తప్పవు**
**కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కాగజ్‌నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, 700 దేశీ దారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.వివరాలలోకి వెళ్తే, కాగజ్ నగర్ మండలంలోని కోసిని గ్రామపంచాయతీ డా డా నగర్ పోచమ్మ గుడి సమీపంలో శుక్రవారం ఉదయం సుమారు 08:00 గంటల సమయంలో సిర్పూర్-టి నుండి కాగజ్‌నగర్ వైపు వస్తున్న ఎం.హెచ్ 34 సిజి 4729 నంబర్ గల టి.వి.ఎస్ స్కూటీ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలోని వ్యక్తులు సరైన పత్రాలు చూపించలేకపోవడంతో వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో మూడు ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 700 “రాకెట్ దేశీ దారు” (ప్రతి ఒక్కటి 90 మి.లీ.) బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 63 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా, దాని సుమారు మార్కెట్ విలువ రూ. 25,200/-గా అంచనా వేశారు.



**నిందితుల వివరాలు:**
1. రెడ్డి సాయి కుమార్ (28 సం॥), అశోక్ కాలనీ, కాగజ్‌నగర్
2. నీటూరి సురేష్ (22 సం॥), సుభాష్ కాలనీ, కాగజ్‌నగర్

ప్రాథమిక విచారణలో, నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి, కాగజ్‌నగర్ ప్రాంతంలో అధిక ధరకు అక్రమంగా విక్రయించి లాభం పొందాలనే ఉద్దేశంతో తరలిస్తున్నట్లు వెల్లడైంది.ఈ కేసులో మద్యం మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతోంది. అని వెల్లడించారు.ఈ ఆపరేషన్‌లో పిసి పి. దుర్గా ప్రసాద్ మరియు డి.దీపక్ లు కూడా పాల్గొన్నారు.

**పోలీసుల విజ్ఞప్తి:**
అక్రమ మద్యం రవాణా లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలి అని అన్నారు.

## కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: సిపిఎం పిలుపు

**హైదరాబాద్ పల్స్, మే 01, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
**కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధానాలను తక్షణమే** నిలిపివేయాలని, వారి హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సిపిఎం డోర్నకల్ మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 140వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గొల్లచర్ల గ్రామంలో మేడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నాలుగు ప్రదేశాల్లో సిపిఎం, సిఐటియు జెండాలను ఎగురవేసి కార్మికుల పోరాట స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి మూలస్తంభాలు కార్మికులు, కూలీలు, రైతులేనని స్పష్టం చేశారు. వారు చెమటోడ్చి నిర్మించిన రహదారులు, పరిశ్రమలు, వ్యవసాయ రంగం దేశ ప్రగతికి పునాది రాళ్లని పేర్కొన్నారు. అమెరికాలోని చికాగోలో కార్మికులు 18 గంటల పని గంటలను 8 గంటలకు పరిమితం చేయాలని చేసిన పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగం నుంచే ఎర్రజెండా పుట్టిందని, అదే జెండా నేడు ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కుల కోసం పోరాటానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలను కులం, మతం, భాష పేర్లతో విభజిస్తూ కార్మిక వర్గాన్ని బలహీనపరుస్తోందని విమర్శించారు. కార్మికులు, రైతులు, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వారి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి నరిగ ఓదేశతో



పాటు బొల్లగాని వీరలక్ష్మి, మోటపోతుల ఓదేశ, కొడవండ్ల సైదులు, మల్లికంటి మల్లయ్య, బయ్య రామదాసు, పెంటిక వెంకట్రాములు, గంధసిరి వాసు, దేశబోయిన వీరన్న, వేముల యమున, రాసాల లింగయ్య, మేకపోతుల శ్రీధర్, అంజయ్య, నాగేష్, షేక్ మౌలానా, నల్ల వీరన్న, భోజ్జ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాది హామీతో చేపల చెరువులు...రైతులకు అదనపు ఆదాయం

**సిర్పూర్‌టిలో కలెక్టర్ హరిత పరిశీలన**
**వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటలకే పనులు ముగించాలని ఆదేశం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాది హామీ పథకం కింద రైతులు తమ పొలాల్లో చేపల చెరువులు (ఫిష్ పాండ్) నిర్మించుకోవచ్చని, దీని వల్ల వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం వస్తుందని కలెక్టర్ హరిత తెలిపారు.శుక్రవారం సిర్పూర్‌టి మండలంలో ఉపాది హామీ పథకం కింద నిర్మాణంలో ఉన్న చేపల చెరువు పని స్థలాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకోవాలని ఆదేశించారు. పని స్థలాల్లో నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అధికారులను హెచ్చరించారు. ఉపాది హామీ పథకం ద్వారా రైతులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా చేపల చెరువులు తవ్వించుకోవచ్చని, ఇవి భూగర్భ జలాల పెంపునకూ దోహదం చేస్తాయని వివరించారు. రైతులు వ్యవసాయంతో పాటు చేపల పెంపకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో సిర్పూర్‌టి ఎం పి డి ఓ, స్థానిక సర్పంచ్, ఉపాది హామీ



సిబ్బంది పాల్గొన్నారు. కూలీలకు అల్పాహారం అందించారు.

## ఆసిఫాబాద్ బస్ స్టేషన్‌లో ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలు

**కార్మికుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ కట్టుబడి ఉంటుంది. ఆత్రం సుగుణ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోనిబస్ స్టేషన్‌లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇంచార్జి అజ్మీర శ్యామ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, ఆర్టీసీ కార్మికులతో కలిసి జెండా వందనం నిర్వహించారు. అనంతరం డిసిసి అధ్యక్షురాలు సుగుణ మాట్లాడుతూ..కార్మిక దినోత్సవం పుట్టుకను గుర్తు చేశారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని విధానం కోసం పోరాడిన నేపథ్యంలో ఈ దినోత్సవం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం పోరాటాలకు ప్రతీకగా మే 1ను అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఆర్టీసీ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ, వాటిని పూర్తిగా అమలు చేయటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.కార్మికులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి వల్లే దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ తారీక్, భీమ్ రావ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిన్న మల్లేష్,మాజి ఎంపీటీసీ



సిడాం తిరుపతి, నాంపెల్లి శంకర్,పెందొర్ సుధాకర్, ఇల్లూరి రాము,కనక జలీమ్ షా, రాపర్తి మురళి,వార్డు సభ్యులు జావీద్, సంతోష్, నిఖిల్, బాలు, శివరామ్ నాయక్, సర్పంచ్ వినోద్,ఆర్ టీ సి డి ఎం, ఆర్ టి సి ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పంజాబ్ అసెంబ్లీలో హైడ్రామా.. సీఎం మద్యం సేవించి వచ్చారంటూ ప్రతిపక్షాల ఆరోపణ..ఆల్కహాల్ టెస్ట్ చేయాలంటూ డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, సెంట్రల్ డెస్క్:**
పంజాబ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మే1న కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశం.. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం సేవించి సభకు హాజరయ్యారంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలు పెను సంచలనాన్ని సృష్టించాయి.ముఖ్యమంత్రి మద్యం మత్తులో అసెంబ్లీకి వచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. దీనిపై స్పందించిన ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బాజ్వా.. సభలోని శాసనసభ్యులందరికీ వెంటనే ఆల్కహాల్ టెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎంపై ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు నిజానిజాలు తేలాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.శిరోమణి అకాలీ దళ్ సైతం ఈ వివాదంలోకి ఎంటరైంది. అసెంబ్లీలో సీఎం ప్రవర్తనకు సంబంధించిన వీడియోలను విడుదల చేస్తూ.. కార్మిక దినోత్సవం నాడు ఇలా మద్యం సేవించి రావడం పంజాబ్‌కు సిగ్గుచేటని మండిపడింది. పంజాబ్ ప్రజల సమక్షంలోనే భగవంత్ మాన్‌కు డోపింగ్ టెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది.ఈ గందరగోళంపై స్పందించిన సీఎం భగవంత్ మాన్.. ఈ సమావేశం కార్మికులకు గౌరవప్రదంగా కేటాయించినదని.. సభ్యులందరూ అనవసర వాదనలు మానుకొని సభా మర్యాదను కాపాడాలని కోరారు.ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు ఇటీవల బీజేపీలో చేరడంతో పంజాబ్ రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. ఈ క్రమంలోనే.. ప్రభుత్వం తన పదవీకాలం ముగిసే దశలో ఇలాంటి సమావేశాలు నిర్వహించడం వల్ల కార్మికులకు వచ్చే లాభమేంటని కాంగ్రెస్ నేత వారింగ్ ప్రశ్నించారు.




## సిర్పూర్(టి)లో ఉపాధి పనులపై ఆకస్మిక తనిఖీ

**ఎండ తీవ్రత దృశ్య ఉదయాన్నే పనులు పూర్తి చేయాలి. జిల్లా కలెక్టర్ హరిత**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురంభీం జిల్లాలోని సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. కూలీలతో మాట్లాడి మే డే సందర్భంగా వారిని అభినందించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయాన్నే పనులు పూర్తి చేయాలని సూచించారు. కూలీలకు అల్పాహారం అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డోర్నకల్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం



**హైదరాబాద్ పల్స్, మే 01, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ పట్టణంలో సంక్షేమానికి ప్రతీకగా నిలిచేన ఇందిరమ్మ ఇళ్లు ను శు క్రవారం ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకుడు రెడ్డబోయిన శంకర్ నిర్మించిన ఇందిరమ్మ ఈ గృహాన్ని మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్, వైస్ చైర్మన్ మదా లావణ్య శ్రీనివాస్, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్, మాట్లాడుతూ, పేద ప్రజల నివాస సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేలా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కలగడం సామాజికాభివృద్ధికి దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రారంభోత్సవం అనంతరం రెడ్డబోయిన శంకర్ దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాబా, దాసరి నాని యాదవ్, ఏపూరి రమణ, కృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## సమాజ సేవకు గుర్తింపు - దళిత రత్న అవార్డు అందుకున్న అయిల్ల శంకర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన అయిల్ల శంకర్ కు ప్రతిష్టాత్మక "దళిత రత్న" అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డును మాదిగ హక్కుల రాష్ట్ర అధ్యక్షులు సునీల్ మాదిగ, గౌరవ అధ్యక్షులు పెరుమాండ్ల రామకృష్ణ, జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ రోజా రాణి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు అయిల్ల శంకర్ గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండి పనిచేస్తూ, పేద ప్రజలకు సహాయం చేయడం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం అందించడం, గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం వల్ల ఈ అవార్డుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా దళిత సమాజం అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు, యువతలో చైతన్యం కలిగించేందుకు చేపట్టిన కార్యక్రమాలు ప్రశంసనీయం అని కొనియాడారు. అవార్డు స్వీకరించిన అనంతరం అయిల్ల శంకర్ మాట్లాడుతూ, ఈ అవార్డు నాకు నాయొక్క సేవలను పెంచుతూ నాకు ప్రజలకు సేవలను అందించే అవకాశం లభించింది అని అన్నారు అలాగే సమాజ సేవే నా లక్ష్యం. భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టి, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తాను" అని తెలిపారు. గ్రామ ప్రజలు, స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు అయిల్ల శంకర్‌ను అభినందిస్తూ, ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్ , పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ , జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు రవి, గొంగటి రాజు, బొగ్గుల అశోక్, గొంగటి కృష్ణ, బొడ్డు లింగం, మన్నే రేగొండ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో మే డే వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన మే డే వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు బీర్ల ఐలయ్య కి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆర్టీసీ కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, కార్మికులే సమాజ నిర్మాణానికి పునాది అని తెలిపారు. వారి కష్టపడే తత్వం వల్లనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మొన్నటి ఆర్టీసీ కార్మికుల సమ్మెలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కి ఘనంగా నివాళులు అర్పించారు,ఆర్టీసీ కార్మికులు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడుతూ, వారి సేవలు ఎప్పటికీ గుర్తుండేలా ఉంటాయని అన్నారు. దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని వ్యవసాయం పరిశ్రమలు నిర్మాణ రంగంలో వారి సేవలు గొప్పవారు కార్మికుడి దేశానికి వెన్నుముక అనే భావనతో ఈరోజు కార్మికుల దినోత్సవం జరుపుకోవడం సంతోషం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేస్తాం : బండి సంజయ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందడంతో అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజోన్న శనగ కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. శుక్రవారం సీఎం రేవంత్రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈసందర్భంగా వివరిస్తూ రబీ సీజన్లో క్వింటాల్కు రూ. 500 బోనస్చెల్లించాలని తాలు, తరుగు, తేమ పేరు చెప్పి దోచుకుంటున్న దళారుల నుంచి రైతు ఆదుకుని ప్రతి గింజను మద్దతు దరకే కొనుగోలు చేయాలని డిమాండ్చేశారు. తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటానన్న హామీని సమాధి చేశారని, కళ్లముందే తేమ పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నా ఎందుకు పట్టించుకోరని నిలదీశారు. మండుటెండల్లో కొనుగోలు కేంద్రాలవద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు మీకు పట్టవా, వడ్లకు బోనస్ హామీ అంతా ఉత్తిదే అంటూ ఎద్దేవా చేశారు. గత రబీ సీజన్ కూ బోనస్ ఎగ్గొట్టి ఈ సీజన్ లోనూ బోనస్ కు పాతరేసినట్లేనా అంటూ ప్రశ్నించారు.పత్తి పంటకు మద్దతు ధర ఎగానామం పెట్టి రైతులను ముంచారని, మొక్కజొన్నకు కేంద్రం ఎమ్మెస్పీ ఇస్తున్నా కొనుగోలు బాధ్యతను విస్మరించి దళారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో రెండున్నరేళ్లలో 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టపోతే జరిగితే ఏం చర్యలు తీసుకున్నారని చెప్పాలని, ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.5 వేల కోట్లు చెల్లించాలని కానీ రూ.260 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దళారులకు దోచిపెట్టి రైతులను రోడ్డున పడేయడమే కాంగ్రెస్విధానామా, పౌరసరఫరాల సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ రూ.56 వేల కోట్ల అప్పులతో దివాళా తీయించిందన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సంస్థను రూ.లక్ష కోట్ల అప్పుల పాలు చేశారని, వరంగల్ డిక్లరేషన్ ను పాతిపెట్టి రాయపూర్ ఏఐసీసీ రైతు తీర్మానాలకు తిలోదకాలిచ్చారా అని పేర్కొన్నారు.రబీ సీజన్ లో రైతుల బాధలపై ఏనాడైనా సమీక్షించారా, వడగాల్పులతో జనం అల్లాడుతుంటే డిజాస్టర్ మంత్రి నిద్రపోతున్నారని నిలదీశారు.ఎన్నడూ లేనంతగా ఎండలు మండిపోతుంటే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఎందుకు చేయలేదన్నారు.కరప్షన్, కలెక్షన్, ల్యాండ్ సెటిల్ మెంట్లు తప్ప రైతుల కన్నీటి వెతలతో మీకు పనిలేదని, నమ్మి ఓటేసిన పాపానికి అన్నదాతలను నట్టేట ముంచుతారా అని విరుచుక పడ్డారు. రైతు వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర పడినా మీకు చలనం లేదని, తక్షణమే రైతులను ఆదుకోవాలని, అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## మక్కలు, ధాన్యం మార్క్‌ఫెడ్‌కు అమ్మి మద్దతు ధర పొందండి

**కౌటాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కలెక్టర్ హరిత**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగిలో పండించిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కలెక్టర్ హరిత రైతులకు విజ్ఞప్తి చేశారు.శుక్రవారం కౌటాల మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగిలో మార్క్‌ఫెడ్, గురుడుపేట ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, సాండ్‌గాం గ్రామంలో సెర్ఫ్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, అదనపు కలెక్టర్ ఎం.డెవిడ్‌లతో కలిసి కలెక్టర్ హరిత ప్రారంభించారు. దళారులకు అమ్మకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ రైతులను కోరారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు ?500 బోనస్ అందిస్తారని కలెక్టర్ తెలిపారు. కాగజనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజా పాలన ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రమంతటా కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. రైతు వారోత్సవాలు మే 4--9. నేల పరీక్ష, పంట రుణాలు, డ్రోన్ ప్రదర్శనలు, కుసుమ్ పథకం, పశుసంవర్ధకం, కాలువల శుభ్రత వంటి అంశాలపై రైతులకు రోజువారీగా అవగాహన కల్పిస్తారు. ధాన్యం కొనుగోలు రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయి. 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు రైతులకు రూ.581 కోట్ల 72 లక్షలు చెల్లించారు. కొమురం భీం జిల్లాలో 34 కేంద్రాలు ఏర్పాటయ్యాయి.నీట్ పరీక్ష మే 3 జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 334 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు జరుగుతుంది. అభ్యర్థులు ఉదయం 11.30కే రిపోర్ట్ చేయాలి. జనగణన స్వీయ గణన మే 10 వరకు మే 11 నుండి ఇండ్ల గణన మొదలవుతుంది. మే 10లోగా ప్రభుత్వ ఉద్యోగులందరూ స్వీయ గణన పూర్తి చేయాలి. ప్రజావాణి, ఉపాధి హామీ మే 4 నుండి డివిజన్ స్థాయి ప్రజావాణి ప్రారంభమవుతుంది. దరఖాస్తులు 30 రోజుల్లో పరిష్కరించాలి. ప్రతి గ్రామ పంచాయతీ నుండి రోజూ 150 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వంజిరి గ్రామంలో ఘనంగా బుద్ధ పౌర్ణిమ వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 01, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో బుద్ధ పౌర్ణిమను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భారత్, లింగయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.బుద్ధుడి శాంతి, అహింస, సమానత్వ బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. కోపం, ద్వేషం విడిచిపెట్టి కరుణ, మానవత్వంతో జీవించాలని సూచించారు. గ్రామంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.